ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 22 ఏప్రిల్ 2025



సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు: డీఎస్పీ

గుమ్మలక్ష్మీపురం/కురుపాం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు ఆదేశించారు. సోమవారం ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఏజెన్సీలో సారా తయారీ, రవాణా, అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. యువత అతి వేగంతో బైక్‌లను నడిపితే.. వారి తల్లిదండ్రులను పిలిపించి మందలించాలన్నారు. అనంతరం కురుపాం మండలం నీలకంఠాపురం పోలీసే స్టేషన్‌ను పరిశీలించారు.

- ఆనవాళ్లను కోల్పోతున్న కోనేరులు, చెరువులు
- కానరాని పరిరక్షణ చర్యలు
- రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- కలుషితమవుతున్నా పట్టించుకునే వారేరీ..?
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాటి అభివృద్ధికి ప్రణాళికలు
- వైసీపీ పాలనలో తూతూమంత్రంగా పనులు.. ప్రజాధనం వృథా
- చొరవ చూపని ప్రజాప్రతినిధులు, అధికారులు


వైసీపీ హయాంలో నామమాత్రపు పనులకే పరిమితమైన నవదుర్గా ఆలయ చెరువు

కుదించుకుపోయి.. రూపు కోల్పోయి!

పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో పురాతన చెరువులు, కోనేరులు ఆనవాళ్లను కోల్పోతున్నాయి. కబ్జాదారుల చేతుల్లో చిక్కి కుదించుకుపోతున్నాయి. చెరువు గట్లపై ఆవాసాలు పెరిగిపోతున్నా.. రెవెన్యూ, మున్సిపల్ ప్రణాళిక విభాగం అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో కోనేరులను తవ్వించడమే కాకుండా సుందరీకరణకు అప్పట్లో జమీందార్లు, దాతలు ఎంతో కృషి చేశారు. అంతే కాకుండా 1950 వరకు కోనేరుల నీటినే ప్రజలు తాగేందుకు ఉపయోగించే వారు. 1959లో పార్వతీపురం మున్సిపాల్టీగా ఏర్పడిన తర్వాత అప్పటి పార్లమెంట్ సభ్యులు వైరిచర్ల చూడామణి దేవ్ తాగునీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. కోనేరుల అభివృద్ధికి నిధులు కేటాయించారు. అయితే కాలక్రమంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా జిల్లా కేంద్రంలో చెరువులు, కోనేరులు పూర్వ వైభవాన్ని కోల్పోయి అధ్వానంగా మారాయి. వాటిపై ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కబ్జాల పర్వం..

- నివాసాలు, వ్యాపార వాణిజ్య కేంద్రాల నిర్మాణంతో పట్టణంలో బోటువాని చెరువు ఉనికి కోల్పోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో దాని సుందరీకరణకు పాలకవర్గం ఆమోదముద్ర వేసినప్పటికి అది కాగితాలకే పరిమితమైంది.
- జగన్నాథపురంలోని పాత్రుడు కోనేరు చుట్టూ ఇదే పరిస్థితి నెలకొంది. గట్టు చుట్టూ నివాసాలు ఏర్పడ్డాయి. అక్రమ నిర్మాణాలు తొలగించి, సుందరీకరణ చేపట్టాలని ఆ ప్రాంతవాసులు అధికారులు చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.
- పట్టణ నడిబొడ్డులో ఉన్న అమ్మిగారి కోనేరు అభివృద్ధికి 2012 సాధారణ సమావేశంలో పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినప్పటికి అవి కూడా కాగితాలకే పరిమితమయ్యాయి.

కలుషితమవుతున్నా..

ఒకప్పుడు జిల్లా కేంద్ర ప్రజల దాహార్తి తీర్చి.. వ్యవసాయ భూములకు సాగునీరు అందించిన చెరువులు ప్రస్తుతం నిరాదరణకు గురవుతున్నాయి. వ్యర్థాలు, చెత్తాచెదారాలతో నిండి కలుషితమవుతున్నాయి. రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. జగన్నాథపురం పాత్రుడు కోనేరు, ఎస్ఎన్ఎం నగర్ సమీపంలోని అమ్మగారి కోనేరు, బోటువాని చెరువు, కొత్తవలస నవదుర్గా ఆలయానికి ఆనుకొని ఉన్న చెరువులు రూపును కోల్పోయాయి. దుర్వాసనలతో పాటు దోమలకు నిలయంగా మారాయి.

వైసీపీ పాలనలో ...

గత వైసీపీ ప్రభుత్వం చెరువుల అభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించలేదు. పైగా టీడీపీ ప్రభుత్వ హయాంలో చెరువుల పరిరక్షణకు మంజూరైన నిధులను దారిమళ్లించారనే ఆరోపణలు న్నాయి. వైసీపీ ప్రభుత్వ ఏర్పడ్డ తొలి ఏడాదిలోనే

(మిగతా 8వ పేజీలో...)

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

పట్టణంలో చారిత్రక చెరువుల అభివృద్ధికి 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అడుగులు పడ్డాయి. బోటువాని చెరువు, పాత్రుడు కోనేరు, అమ్మిగారి కోనేరు, నవదుర్గా ఆలయం సమీపంతో పాటు బెలగాంలో లంకెల చెరువు అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. అప్పట్లో సుమారు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు జరిగినప్పటికీ పాలకుల పర్యవేక్షణ లోపం, అధికారులు అశ్రద్ధ కారణంగా పనులు ముందుకు సాగలేదు. 2016లోనూ చెరువుల సుందరీకరణకు ప్రతిపాదనలు పంపాలని అప్పటి ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించింది. ఎవరి నిర్లక్ష్యమో ఏమో కాని పనుల్లో మాత్రం ఎటువంటి పురోగతి లేదు.


ఆక్రమణలకు గురైన బోటువాని చెరువు

ఘనంగా ఇప్పలపోలమ్మ

పాలజంగిడి ఊరేగింపు

- పార్వతీపురంలో సందడే సందడి

6 లో

కూలీల కొరతకు..

యాంత్రీకరణే పరిష్కారం

- యువత వ్యవసాయరంగం వైపు రావాలి
- ఎన్జీరంగా వర్సిటీ పరిశోధన సంచాలకుడు పీవీ సత్యనారాయణ
- విజయనగరంలో ఉత్తర కోస్తా జిల్లాల వ్యవసాయశాఖ అధికారుల సమావేశం

నిరసనల హోరు

- వివిధ సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఆందోళనలు

8 లో

గృహయోగమే లక్ష్యంగా..

- మధ్యలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి
- లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం
- వచ్చేనెల 31 నాటికి పెండింగ్ పనుల పూర్తికి చర్యలు


గరుగుబిల్లి మండలం సన్యాసిరాజుపేటలో ఇళ్ల నిర్మాణం ఇలా..



పార్వతీపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సగంలో నిలిచిపోయిన పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగానే బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు అదనపు ఆర్థిక సాయం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వచ్చే నెల 31 నాటికి పెండింగ్ గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గత వైసీపీ హయాంలో మంజూరైన ఇళ్లు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధ్యలోనే నిలిచిపోయిన గృహ నిర్మాణాల వివరాలను ఇప్పటికే సేకరించింది. వాటి పనుల పూర్తికి గాను బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేల చొప్పున మంజూరు చేసింది. దీంతో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలకు మోక్షం లభించినట్లయ్యిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దశల వారీగా...

జిల్లాలో మొదటి విడతలో 5,897 గృహ నిర్మాణాల పూర్తికి ప్రణాళికలు రూపొందించారు. ఇందులో ఎస్సీలు 852 మంది, ఎస్టీలు 1646 మంది, బీసీ లబ్ధిదారులు 2,699 మంది ఉన్నారు. మొత్తంగా పెండింగ్ ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం సుమారు రూ.8.30 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించనుంది. తిరిగి ప్రారంభించిన ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉంటే రూ.15 వేలు, రూఫ్ లెవల్‌కు వస్తే రూ.15 వేలు, శ్లాబు స్థాయియి చేరితే రూ.10 వేలు, ప్లాస్టింగ్ పని పూర్తయ్యాక రూ.పది వేలు ఇలా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు అదనపు సాయం అందిస్తారు. ఎస్టీ లబ్ధిదారులకైతే మొదటి దశలో రూ.22,500, రెండో దశలో రూ.22,500, మూడో దశలో రూ.15 వేలు, నాలుగో దశలో రూ.15 వేల చొప్పున విడుదల చేస్తారు. పీటీజీలకు రూ.లక్ష వివిధ దశల్లో అందిస్తారు.

గతంలో ఇలా...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఇళ్ల బిల్లులను పూర్తిగా చెల్లించడం మానేసింది. దీంతో ఎంతోమంది ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకోలేక పోయారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ గృహ నిర్మాణదారులతో పాటు జగనన్న కాలనీల్లో సగంలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలపైనా దృష్టి సారించింది. బిల్లుల చెల్లింపు, అదనపు సాయానికి చర్యలు చేపడుతుండడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనిచేసినా..

ఏం లాభం?

- మస్తర్లలో హాజరు వేయడం లేని వేతనదారుల నిరసన

జియ్యమ్మవలస, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తున్నా.. మస్తర్లలో హాజరు వేయడం లేదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తురకనాయుడువలస పనుల ప్రదేశంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు, మేట్లు నిర్వాహకం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ పి.నాగమణి తెలిపారు. 'గ్రామంలో మొత్తం 550 మందికి పైగా కూలీలు ఉన్నారు. వీరికి గ్రామ సమీపంలో తోటపల్లి ఎడమ ప్రధాన కాలువలో, దాని పక్కనే ఉన్న జన్ని బందలో పనులు కల్పించారు. సోమవారం దాదాపు 400 మంది వరకు కూలీలు ఉపాధి పనులకు వెళ్లారు. అయితే ఇందులో కొందరు పనికి వెళ్లినా మేట్లు అటెండెన్స్ వేయలేదు.' అని సర్పంచ్ చెప్పారు. క్షేత్ర సహాయకుడు, మేట్లు ఒక్కటై.. కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సామాజిక తనిఖీ బృందానికి, కలెక్టర్, ఉపాధి హామీ పథకం పీడీ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించకుంటే బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని కూలీలు చెప్పారు.


నిరసన తెలుపుతున్న సర్పంచ్, ఉపాధి కూలీలు

పంచాయతీ అధికారులదే

చెరువుల బాధ్యత

- ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో చెరువులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యత పంచాయతీ అధికారులదేనని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. రెవెన్యూ, సర్వే, పోలీస్ అధికారుల సమన్వయంతో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పింఛన్లు, ఇతర పథకాల కోసం గ్రామ సచివాలయంలో అర్జీలు ఇచ్చే వారి అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. దీనిపై మండల ప్రత్యేకాధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు సూచించారు. సమస్యలు ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రగతి కనబర్చాలన్నారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు వచ్చిన వినతులను సొంత సమస్యగా భావించి 48 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 147 మంది అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాల్య వివాహాల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి



బాగువలస పాఠశాల వద్ద నమోదైన విద్యార్థులతో ఇన్‌చార్జి డీఈవో

సాలూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరానికి ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి ఆదేశించారు. సోమవారం సాలూరు మండలంలో పురోహితునివలస, బాగువలస తదితర గ్రామాల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమం పరిశీలించారు. తమ పాఠశాలలో ఇప్పటి వరకు 23 మంది విద్యార్థులను తమ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నమోదు చేసుకున్నామని బాగువలస జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం జాగాన రామునాయుడు తెలిపారు. ఈ నెల 23 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేరే విద్యార్థులపై దృష్టిసారించాలని ఇన్‌చార్జి డీఈవో ఆదేశించారు. బడిఈడు పిల్లలు బడిబయట ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదన్నారు. నమోదు శాతం పెరిగితే పాఠశాలలు బలోపేతమవుతాయని తెలిపారు. సాలూరు ఎంఈవో-2 నల్ల వెంకటరావు, ఉపాధ్యాయులు లక్ష్మనాయుడు, గౌరీశంకర్, మత్స్యేశు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల భారం తగ్గింది

6 లో

- అన్ని సేవలూ ఒకే దానిలోనే..
- అందుబాటులోకి లీప్ యాప్
- ఉపాధ్యాయుల్లో హర్షం



పాడి రైతులకు భరోసా

- బీమా వాటా ప్రీమియం తగ్గించిన ప్రభుత్వం
- నిబంధనల్లో పలు మార్పులు
- ఈనెల నుంచి అమల్లోకి వచ్చిన పథకం

6 లో




మూడు వారాలుగా మొరాయింపు

- తహసీల్దార్ కార్యాలయాల్లో సర్వర్ సమస్య
- రైతులకు తప్పని ఇబ్బందులు

గరుగుబిల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సర్వర్ సమస్య నెలకొంది. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత మూడు వారాలుగా ఈ సమస్య వేధిస్తుండడంతో రెవెన్యూ కార్యాలయాల్లో ఏ పనులూ కావడం లేదు. భూముల రికార్డులు, రైతుల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదు. ప్రధానంగా మ్యూటేషన్లు, మార్పులు, చేర్పులు, అడంగళ్ సవరణతో పాటు ఫోన్ నెంబర్లు అనుసంధానం వంటి కార్యక్రమాలు నిలిచాయి. వెబ్‌ల్యాండ్‌లో ఆన్‌లైన్ సర్వర్ సమస్య కారణంగా సకాలంలో రైతులు సంబంధిత బ్యాంకుల్లో రుణాలు పొందలేని పరిస్థితి నెలకొంది. భూములకు సంబంధించి 1బీలు అందుబాటులో లేకపోవడంతో రుణాలు చెల్లింపులు, రెన్యువల్ వంటి అవకాశాలకు దూరమవు తున్నారు. రైతులు తమ రుణాలకు వడ్డీ , చక్ర వడ్డీలు కట్టుకునే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది నిత్యం కంప్యూటర్లు ముందు కుస్తీ పడుతున్నారు. అయినా సర్వర్ సమస్య తేలకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యూటేషన్లకు తహసీల్దార్లు బయోమెట్రిక్ వేస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీనిపై గరుగుబిల్లి తహసీల్దార్ పి.బాలను వివరణ కోరగా.. సర్వర్ సమస్య కారణంగా పలు రకాల ఫైళ్లు ముందుకు వెళ్లడం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.


గరుగుబిల్లి తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ల ముందు సిబ్బంది ఇలా..

యాప్‌ల భారం తగ్గింది





పాఠశాల విద్యలో నూతనంగా ప్రవేశపెట్టిన లీప్ యాప్



లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్న ఉపాధ్యాయుడు

- అన్ని సేవలూ ఒకే దానిలోనే..
- అందుబాటులోకి లీప్ యాప్
- ఉపాధ్యాయుల్లో హర్షం

నెల్లిమర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో యాప్‌ల భారం మోయలేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విద్యార్థుల హాజరుకు ఒక యాప్.. ఉపాధ్యాయుల ముఖహాజరుకు యాప్.. మధ్యాహ్న భోజనం అమలుకు యాప్.. మరుగుదొడ్ల నిర్వహణకు యాప్.. విద్యార్థుల మార్కుల అప్‌లోడ్‌కు యాప్.. ఇలా ఉపాధ్యాయులు ఇంత కాలం అల్లాడిపోయారు. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి తిరిగి ఇంటికి వచ్చే వరకు యాప్‌లతో ఆపసోపాలు పడాల్సి వచ్చేంది. ఉపాధ్యాయులంటే విద్యార్థులకు బోధన చేయాలి. కానీ వైసీపీ హయాంలో తీసుకువచ్చిన యాప్‌లతో బోధన పక్కన పెట్టాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు యాప్‌ల కష్టాలు నుంచి ఊరట కల్పించింది. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులు నిత్యం పదికిపైగా యాప్‌లలో సమాచారం పంపాల్సి వచ్చేది. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమల్లో భాగంగా కూటమి ప్రభుత్వం యాప్‌ల భారం తగ్గించింది. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న నారా లోకేష్. పాఠశాల స్థాయిలో ఒకే యాప్‌ను తీసువస్తున్నట్లు ప్రకటించారు. కొద్ది రోజుల్లో దీన్ని అమలు చేశారు.

- జిల్లా మొత్తం మీద 1732 పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో అంశానికి సంబంధించి ఒక్కో యాప్‌ను ప్రవేశ పెట్టారు. ఉపాధ్యాయులపై కక్షసాధింపులా వీటిని ప్రవేశపెట్టారన్న విమర్శలు వచ్చినా.. యాప్‌లు కష్టాల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు ఆందోళనలు చేపట్టినా నాటి ప్రభుత్వం స్పందించలేదు. దాదాపు పదికిపైగా యాప్‌లతో నిత్యం ఉపాధ్యాయులు కుస్తీ పడాల్సి వచ్చేది.

ఇక అన్నింటికీ లీప్ యాప్..

ప్రభుత్వం తాజాగా లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో యాప్‌ను తీసుకువచ్చింది. లీప్ యాప్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకునేలా ఏర్పాటు చేసింది. జిల్లాలో డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గతంలో ఉన్న టీచర్ అటెండెన్స్ యాప్ ఆటోమెటిక్‌గా లీప్‌గా మార్పు చేసింది. గతంలో వాడిన యూజర్ నేమ్.. పాస్‌వర్డులనే ఇప్పుడూ వినియోగించాలని సూచించింది. ఈ యాప్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఎండీఎం నిర్వహణ చేయాల్సి ఉంది. అలాగే ఉపాధ్యాయులకు చెందిన పూర్తి సమాచారం కూడా ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఉపాధ్యాయులకు సౌలభ్యం..

ఉపాధ్యాయులు గతంలో వేర్వే రు యాప్‌ల ద్వారా వివరాలను అప్‌లోడ్ చేసేవారు. ఆ శ్రమలేకుండా ప్రభుత్వం తాజాగా ఒకే యాప్‌ను రూపొందించి ఆ వివరాలను ఒకే యాప్‌లో అప్‌లోడ్ చేసే వీలు కల్పించింది. ఈ విధానం ఉపాధ్యాయులకు ప్రయోజనం.

-యు.మాణిక్యంనాయుడు, డీఈవో

బహుళ యాప్‌ల నుంచి విముక్తి..



బహుళ యాప్‌ల నుంచి ప్రభుత్వం ఉపాధ్యాయులకు విముక్తి కల్పించింది. అన్ని వివరాలను ఒకే యాప్‌లలో నిక్షిప్తం చేయడం ద్వారా సులభతరం చేసి ఉపాధ్యాయులకు మేలు జరిగేటట్లు ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం.

-టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు

శుభపరిణామం..



గతంలో వివిధ యాప్‌ల్లో వివరాలు అప్‌లోడ్‌చేయాల్సి రావడం వల్ల ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఒకే యాప్ వల్ల ఇబ్బందులు తప్పాయి. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

-కె.రవి, ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్



ఆకుల్లేవ్.. అన్నీ పూలే..

చెట్లకు ఆకులతో పాటు పూలు ఉండడం సహజం. కానీ రాజాం-శ్రీకాకుళం రోడ్డులో అంతకాపల్లి నుంచి వి.ఆర్.అగ్రహారం జంక్షన్ వరకు.. రహదారికి ఇరువైపులా 40 చెట్లకు ఆకుల్లేకుండా కొమ్మకొమ్మకు తెలుపు, లేత గులాబీ రంగులో పూలు కనువిందు చేస్తున్నాయి. వీటిని ఈ ప్రాంతంలో పచ్చగని లేదా రక్తగంధ అంటారని స్థానికులు చెబుతున్నారు. దీని శాస్త్రీయ నామం టుబెబూయా అని వృక్షశాస్త్ర అధ్యాపకుడు నవీన్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. వర్షాకాలంలో దట్టంగా ఆకులతో నిండి ఉంటాయని, వేసవికాలంలో ఆకులన్నీ రాలిపోయి పూలు పూస్తాయని ఆయన వెల్లడించారు. మనదేశంతో పాటు దక్షిణ అమెరికా, మెక్సికో, వెనిజులాలో రోడ్ల పక్కన ఆకర్షణీయంగా ఉండేందుకు వీటిని నాటుతారన్నారు.

-రాజాం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి)

తల్లుల కాళ్లు కడిగి.. దీవెనలందుకుని

గంట్యాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చినమదుపాడ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని విద్యార్థులు భిన్నంగా జరుపుకున్నారు. పిల్లలంతా తల్లుల పాదాలు కడిగి దీవెనలందుకున్నారు. కాళ్లకు పసుపు, గంధం పూసి తాంబూలం అందజేసి బాగా చదువుకునేలా చూడాలని మొక్కారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంకపల్లి శివప్రసాద్ పాల్గొన్నారు.



తల్లుల కాళ్లు కడుగుతున్న పిల్లలు



ఇప్పలపోలమ్మ పాలజంగిడిని ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా ఇప్పలపోలమ్మ పాలజంగిడి ఊరేగింపు

పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్ర ప్రజల ఇలవేల్పు ఇప్పల పోలమ్మ అమ్మవారి పాలజంగిడిని స్థానిక పద్మశ్రీ థియేటర్ సమీపంలో గల వనం గుడి నుంచి నాయుడు వీధిలో గల ప్రధాన ఆలయానికి మేళాతాళాలతో తీసుకువచ్చారు. సోమవారం రాత్రి ఇప్పలపోలమ్మ అమ్మవారి పాల జంగిడికి వనం గుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన ఆలయం వరకు అమ్మవారి పాలజంగిడిని ఘనంగా ఊరేగించారు.



పాలజంగిడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



గొర్రెల సంఖ్య పెరిగి, బీమా ప్రీమియం తగ్గి..

పాడి రైతులకు భరోసా

- బీమా వాటా ప్రీమియం తగ్గించిన ప్రభుత్వం
- నిబంధనల్లో పలు మార్పులు చేసిన వైనం
- ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చిన పథకం

రాజాం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి)

పాడి రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పశువులకు బీమా ప్రీమియంలో రైతుల వాటాను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా కారణాలతో పశువులు, గొర్రెలు, మేకలు మృతి చెందితే బీమా సొమ్ము రైతులకు అందేలా కార్యాచరణ సిద్ధంచేసి అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేసింది. పాడి రైతులకు అండగా ఉండేందుకు వీలుగా పశు బీమా పథకంలో పలు మార్పులు తీసుకువచ్చింది.

- జిల్లాలో మొత్తం 119 పశువైద్య శాలలు ఉన్నాయి. ఆవులు, గేదెల సంఖ్య 4.76 లక్షలు ఉండగా.. మేకలు, గొర్రెలు సంఖ్య 6.32 లక్షలు ఉంది. పందులు 2.43 లక్షలు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోండి..

పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గతంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం బీమా ప్రీమియం తగ్గింపుతో పాటు మరిన్ని అదనపు వెసులుబాట్లు కల్పించింది. రైతులు అందుబాటులో ఉన్న పశువైద్యుల్ని సంప్రదించాలి. ఒకసారి బీమా చేస్తే మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

-డా.జయప్రకాశ్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ

నూతన మార్గదర్శకాలివిగో..

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాడి రైతు గరిష్ఠంగా ఐదు పశువులకు మాత్రమే బీమా చేసుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం గరిష్ఠంగా పది పశువులకు బీమా చేసుకునే అవకాశాన్ని కల్పించింది.
- గతంలో గొర్రెలు, మేకలకు సంబంధించి 50కి మాత్రమే బీమా సౌకర్యం ఉండగా నేడు ఆ సంఖ్య 100కి పెంచింది.
- గతంలో రైతు వాటా ప్రీమియం 20 శాతం ఉండగా.. కూటమి ప్రభుత్వం 15 శాతానికి తగ్గించింది.
- గత ప్రభుత్వ హయాంలో బీమా ప్రీమియం చెల్లించినా మృతి చెందిన పశువులకు సకాలంలో నష్టపరిహారం అందేది కాదు. దీంతో చాలామంది రైతులు బీమా చేయించేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. దీంతో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైసీపీ హయాంలో బకాయిలను సైతం రైతులకు పంపిణీ చేసే ఏర్పాట్లు చేసింది.
- ఆవు, పాడిగేదె విలువ రూ.30 వేలుగా నిర్ధారించి మూడేళ్ల ప్రీమియం రూ.1920గా నిర్ణయించింది. ఇందులో రైతు వాటాగా రూ.288 చెల్లిస్తే మూడేళ్లపాటు బీమా పథకం అమల్లో ఉంటుంది.
- నాటు జాతి పశువు విలువ రూ.15 వేలుగా నిర్ధారించింది. మూడేళ్ల ప్రీమియం రూ.960 కాగా రైతువాటా రూ.144 చెల్లిస్తే సరిపోతుంది.
- గొర్రె, మేక, పంది ఒక్కోదానికి ఏడాదికి పెంపకందారు వాటాగా రూ.27, రెండేళ్లకు రూ40, మూడేళ్లకు రూ.56 చెల్లించాలి. ఒక్కొక్కరు గరిష్ఠంగా వంద వరకు బీమా చేయించుకోవచ్చు.
- బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు.. ఎస్సీ, ఎస్టీలైతే రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేయాలి. పశువులు మృతి చెందిన వెంటనే సమీపంలోని రైతు సేవ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చే వరకు పశువులకు వేసిన ట్యాగ్‌ను తొలగించకుండా ఉండాలి. బీమా చేసిన పశువులను విక్రయిస్తే ఏడు రోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపైన మార్చాలి. ఈ నిబంధనలపై సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

కూలీల కొరతకు.. యాంత్రీకరణే పరిష్కారం

- యువత వ్యవసాయరంగం వైపు రావాలి
- ఎన్జీరంగా వర్సిటీ పరిశోధన సంచాలకుడు పీవీ సత్యనారాయణ
- విజయనగరంలో ఉత్తర కోస్తా జిల్లాల వ్యవసాయశాఖ అధికారుల సమావేశం



ఖరీఫ్-రబీకి సంబంధించిన వివరాలను విడుదల చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణ ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చునని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టరు పీవీ సత్యనారాయణ తెలిపారు. ఉత్తర కోస్తాలోని అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వ్యవసాయ పరిశోధన, విస్తరణ మండలి సమావేశం సోమవారం జడ్పీ సమావేశ భవనంలో నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో భాగంగా తొలిరోజు ఖరీఫ్, రబీకి సంబంధించిన వివిధ పంటలు, కొత్త వంగడాలు, అధునాతన వ్యవసాయ పద్ధతులు వ్యవసాయ యాంత్రీకరణ, చీడపురుగుల నివారణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులను వివరించారు. అనంతరం డాక్టరు పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్తర కోస్తాలోని నాలుగు జిల్లాల్లో వ్యవసాయ యాజమాన్య పనుల్లో నాణ్యమైన శిక్షణ అందిస్తామన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో వ్యవసాయోత్పత్తి పెరిగేందుకు మరింతగా వీలుందన్నారు. మొక్కజొన్న వంటి పంటల్లో ఇంకా వృద్ధి సాధించవలసి ఉందని చెప్పారు.

- విస్తరణ సంచాలకులు డాక్టరు శివన్నారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రైతుల పొలాల్లో మినీకిట్లు, ప్రదర్శన కేంద్రాలు, పరిశీలనలు రైతుల భాగస్వామ్యంతో ఇంకా పెరగాలన్నారు. రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.
- వైరా వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు భరతలక్ష్మీ మాట్లాడుతూ నువ్వులలో కలుపు యాజమాన్యం గురించి రైతాంగం గుర్తించాలన్నారు.
- నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ యువత వ్యవసాయం వైపు మళ్లాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పెరగాలని అన్నారు.
- శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలన్నారు.
- వరి, అపరాలు, నూనెగింజలు, మొక్కజొన్న, చిరుధాన్యాలు, మెట్ట వ్యవసాయం, కలుపుశాస్త్రం, యాంత్రీకరణ తదితర అంశాలపై ప్రధాన శాస్త్రవేత్తలు రైతుల నుంచి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.
- విజయనగరం జిల్లా వ్యవసాయాధికారి వీటి రామారావు మాట్లాడుతూ వ్యవసాయం ద్వారా మరింత అధికోత్పత్తి రావాలన్నారు. అభ్యుదయ రైతులు మాట్లాడుతూ అనుబంధ రంగాలైన మేకలు, పాడిపశువుల పెంపకం ద్వారా ఆదాయం పొందుతున్నట్టు వివరించారు.
- రెండోరోజైన మంగళవారం ఉద్యానవన, పట్టు పరిశ్రమలకు సంబంధించి సమావేశం జరగనుంది. కార్యక్రమం అనంతరం ఖరీఫ్-రబీ (2025-26)కి సంబంధించిన ప్రణాళికను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు విడుదల చేశారు.

తొలి రోజు తీర్మానాలు ఇవే..

విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన అభ్యుదయ రైతులు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్న ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. వీటి సాధనకు కృషి చేయాలని సమావేశం నిర్ణయించింది.

తీర్మానాలు ఇవే..

- చిన్న కమతాలకు సంబంధించి యాంత్రీకరణ జరగాలి.
- వేసవిలో కూడా పంటలు పండించాలి. ఈ దిశగా రైతులను సమాయత్తం చేయాలి.
- యువత వ్యవసాయానికి వచ్చేలా అవగాహన కల్పించాలి. వారికి ఈ రంగంలో కూడా ఆదాయం ఎలా వస్తుందన్నదానిపై వివరించాలి.
- వ్యవసాయ రంగంలో నైపుణ్యం పెంచేందుకు యువత కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యసాయానికి ఉపయోగించే అన్ని పనులు నిర్వహించాలి.. చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి.



వృషభ వాహనంపై పరమ శివుడు

పాలకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లలితా మహా త్రిపుర సుందరీ సమేత అమృత మృత్యుంజయస్వామి వారు సోమవారం వృషభ వాహనంపై దర్శన మిచ్చారు. అర్చకులు స్వామివారికి నక్షత్ర హారతి, సర్ప హారతి, కర్పూర మంగళ నీరాజనం ఇచ్చారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు.

కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ

ఎచ్చెర్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా విజేతలకు బహుమతులను ఎచ్చెర్లలోని యూనిట్ కార్యాలయంలో సోమవారం పంపిణీచేశారు. ప్రథమ బహుమతిగా మోటారు బైక్‌ను బల్లా రామకృష్ణ (బోయివీధి, వైఎస్ఆర్ స్ట్రీట్, విజయనగరం), ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్‌ను లంక కుమారి(బొబ్బిలి, విజయనగరం జిల్లా), తృతీయ బహుమతి టీవీని పేడాడ లలితకుమారి (చీమలవలస, ఆమదాలవలస మండలం)కి అందజేశారు.ప్రథమ బహుమతి విజేత రామకృష్ణకు మోటారు బైక్ విలువచేసే చెక్‌ను ఆంధ్రజ్యోతి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్.సోమశంకరరావు, డీసీఎం పి.అనంత కుమార్ అందజేశారు. ద్వితీయ బహుమతి లంక కుమారి ఫ్రిజ్‌ను, తృతీయ బహుమతి పేడాడ లలితకుమారి టీవీని అందుకున్నారు.



విజేతలకు బహుమతులకు సంబంధించిన పత్రాలు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ సోమశంకరరావు, డీసీఎం అనంతకుమార్



పనులను పరిశీలిస్తున్న ఇంజినీర్లు

ఆనకట్ట పనుల పరిశీలన

సంతకవిటి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి); మండలంలోని రంగారాయిపురం వద్ద నారాయణపురం ఆనకట్ట వద్ద జరుగుతున్న ఆధునికీకరణ పనులను విశాఖకు చెందిన మెకానికల్ సబ్ డివిజన్ డీఈ రవికాంత్, జేఈ స్వాతి సోమవారం పరిశీలించారు. షట్టర్ల క్వాలిటీని చూశారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆనకట్ట డీఈ వై.రవీంద్రనాయుడు, జేఈ రాంబాబు తదితరులున్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి 10 నుంచి 12 గంటల వరకూ పోలీసు అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. నగరంలో నేరాల నియంత్రణే లక్ష్యంగా చేపడుతున్న తనిఖీల్లో నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై రెండు కేసులు నమోదు చేశారు. అలాగే రైల్వేస్టేషన్ లో ప్రయాణికుల బ్యాగులను ఓదా చేశారు. తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐలు, వన్‌టౌన్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న చైతన్యబాబు

నెల్లిమర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లిలో నిర్మిస్తున్న జగద్గురు వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయానికి బొత్స చైతన్య బాబు రూ.లక్ష విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. చైతన్యబాబుకు కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటాల ఫలితమే.. డీఎస్సీ నోటిఫికేషన్

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, ఉపాధ్యక్షుడు సతీష్ అన్నారు. సోమవారం ఎల్‌బీజీ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 30 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా, 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.

పేద మహిళకు రూ.26 వేల సాయం

నెల్లిమర్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ దంతినాడ చిన్నమ్మలు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన ఉద్యోగులు, యువకులు స్పందించారు. గ్రామానికి చెందిన కెవిడి ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు 16వేల రూపాయిలు, 2007 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు (ఫ్రెండ్స్ ఫరెవర్ గ్రూప్) 10వేల రూపాయిలు మొత్తం 26 వేల రూపాయిలను బాధిత మహిళ చిన్నమ్మలుకు అందజేశారు.

శివాలయానికి బోరుబావి

వేపాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలాదేవి అగ్రహారంలో నిర్మిస్తున్న శివాలయం వద్ద దేవరాపల్లి మండలం దేవరాపల్లికి చెందిన గొర్రెపోటు బోడినాయుడు, అప్పలనరసమ్మ కుమారుడు చిన్నంనాయుడు బోరు బావిని తవ్విస్తున్నారు. అందుకు సంబంధించిన పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పెద్దలు రావాడ వెంకటరావు, కొటాన అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీతో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని వారి జీవితాల్లో ఆనందం నింపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో కొలువులు భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. తమకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదన్న నిరాశలో యువత ఉండేవారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ మెగా డీఎస్సీ ప్రకటించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మంత్రి లోకేశ్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని నాగార్జున అన్నారు.

చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలభిషేకం



చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

విజయనగరం ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయటంపై టీఎన్ఎస్ఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం కోట జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.భరత్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు చీమల సంతోష్‌కుమార్, పీకేఎల్ రాజు, కొండ్రు సాయివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సంఘం అధ్యక్షుడిగా కృష్ణంరాజు



అధ్యక్షుడు కృష్ణంరాజు

రాజాం/గరివిడి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి డివిజన్ రెవెన్యూ సంఘం అధ్యక్షుడిగా రాజాం తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చీపురుపల్లిలో ఆది వారం ఎన్నిక నిర్వహించారు. సహ అధ్యక్షుడిగా మెరకముడిదాం హెచ్‌డీటీ జి.వి.భాస్కరరావు. ఉపాధ్యక్షులుగా రేగిడి సీ ఎస్ డీటీ పి.రామారావు. గుర్ల ఆర్ఐ పి.దుర్గాప్రసాద్, వంగర జూనియర్ అసిస్టెంట్ పి.ప్రవీణ్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గరివిడి హెచ్‌డీటీ బి.సురేష్. సహాయ కార్యదర్శులుగా సంతకవిటి సీఎస్ డీటీ ఎస్.చిరంజీవిరావు. గరివిడి ఆర్ఎస్ డీటీ డి.శివకుమార్. చీపురుపల్లి జూనియర్ అసిస్టెంట్ సిహెచ్.నరసమ్మలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయం డీటీ ఎస్.హైమవతి. సభ్యులుగా చీపురుపల్లి మండల రెవెన్యూ కార్యాలయం సబ్ ఆర్డినేట్ కె.వరలక్ష్మి, గుర్ల జూనియర్ అసిస్టెంట్ సిహెచ్.శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎస్.కృష్ణంరాజు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఎటువంటి సమ స్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

లాకౌట్ ఎత్తివేతకు చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

లక్కవరపుకోట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమ లాకౌట్‌ను ఎత్తివేసి కార్మికుల జీవితాలను కాపాడాలని జేఏసీ నేతలు, కార్మికులు కోరారు. సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా కర్మాగారాన్ని మూయడం చట్టవిరుద్ధమన్నారు. 57 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 264 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. యాజమాన్యం, పరిశ్రమల శాఖ మంత్రితో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు లగుడు వామాలు, భీమయ్య, ఈశ్వరరావు, అప్పలరాజు, బొట్టా రాము తదితరులు పాల్గొన్నారు.

● కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగారం లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ హరికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు ఉద్యోగ భరోసా కల్పించాలని కోరితే కర్మాగారానే మూసేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. జిందాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

పార్కింగ్ స్థలాలను యథావిధిగా కొనసాగించాలి

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆటో పార్కింగ్ స్థలాలను యథావిధిగా కొనసాగించాలని విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆటో యూనియన్ ప్రతినిధులు ఆందోళన చేశారు. పార్కింగ్ స్థలాలను కొనసాగించడంతో పాటు ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూ నియన్ ప్రతినిధులు సన్యాసిరావు, ధర్మ, రాము, నారాయణరావు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 205 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 205 వినతులు అందాయి. కలెక్టర్ అంబేద్కర్, జేసీ సేతు మాధవన్, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల గాంధీ వినతులను స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి హామీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 25 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ వకుల్ జిందాల్ ఫిర్యాదులను స్వీకరించి సమస్యలపై సానుకూలంగా స్పందించారు. చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్ఐ రాజేశ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు రూ.3.24 లక్షలు



చెక్కు అందజేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కాజా రామారావుకు రూ.3.24 లక్షల చెక్కును సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. హోం గార్డులు ఉద్యోగ విరమణ చేసిన సమయంలో లేదా వారు మృతి చెందిన సందర్భాల్లో వారి కుటుంబాలకు సహచర హోంగార్డులు అండగా నిలిచి ఒక్కరోజు అలవెన్స్ సాయం అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డీపీవో ఏవో శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్‌కుమార్, పర్యవేక్షకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

మిమ్స్‌లో ఘనంగా 'కళా క్రిత్వ'



వేడుకలను ప్రారంభిస్తున్న లైఫ్ ట్రస్టీ

నెల్లిమర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలలో కళా క్రిత్వ వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలను మిమ్స్ లైఫ్ ట్రస్టీ రామకృష్ణరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యవిద్యలో ఒత్తిడిని విద్యార్థులు అధిగమించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కళా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మిమ్స్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ రఘురాం, డైరెక్టర్ వేణుగోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నీలిమ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

రాజాం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాజాంకు చెందిన జనసేన ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్‌బాబుపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు సోమవారం విచారణ చేశారు. టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడు నాగరాజుతో మాట్లాడారు. జనసేన కార్యాలయంలో ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేష్‌బాబుకు చెందిన జనసేన కార్యాలయాన్ని సందర్శించారు. సురేష్‌బాబుతో పాటు ఈనెల 19న సమావేశంలో పాల్గొన్న జనసైనికులతో మాట్లాడారు. ఈ నెల 19న ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సీసీ ఫుటేజీలను ఎస్ఐ రవికిరణ్‌తో కలిసి డీఎస్పీ పరిశీలించారు. అనంతరం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో జనసైనికుల నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్లు నమోదు చేయించారు.

ఉపాధి మేట్ల నియామకమెప్పుడు?

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో చురుగ్గా ఉపాధి పనులు జరుగుతున్నప్పటికీ పనుల పర్యవేక్షణకు నియమించిన మేట్లు తక్కువగా ఉన్నారు. ఫిబ్రవరిలో ఉపాధి మేట్ల నియామకాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా స్థానిక అధికారులు అవేమీ పట్టించుకోవడంలేదు. వాస్తవంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మేట్ల నియామకాలను చేప ట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మేట్ల నియామకం కోసం ఔత్సాహికులు ఎదురుచేస్తున్నారు. ఈ విషయంపై ఏపీవో రమ్య వివరణ కోరగా ఇప్పటి వరకు మండలంలోని నాలుగ పంచాయతీలకు పూర్తిస్థాయి మేట్ల నియామకం చేశామన్నారు. త్వరలోనే అన్ని పంచాయతీల్లో నియమిస్తామని తెలిపారు.

తల్లిపాల ఆవశ్యకతను వివరించండి

● ఐసీడీఎస్ పీడీ బేగం

గంట్యాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు ఆవశ్యకతను ప్రతి బాలింతకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీడీఎస్ పీడీ బేగం అన్నారు. సోమవారం మధ్యాహ్నం రామవరంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలన్నారు. తద్వారా పిల్లల ఆరోగ్యం బాగుంటుందన్నారు. అందుకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలోని ఐసీడీఎస్ పీవో ఉమాభారతి, ఎంపీడీవో రమణమూర్తి, టీడీపీ నాయకులు అల్లు విజయకుమార్, సూపర్‌వైజర్లు పద్మ, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

●రాజాం/రూరల్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక ఐసీడీస్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ పక్వాడా ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాజాం: వేదికపై ఎంపీడీవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బేగం

●కొత్తవలస: గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం కొత్తవలస ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాలకు ఆమె హాజర య్యారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, కొత్తవలస సీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ, ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి, ఏసీడీపీవో లక్ష్మిబాయ్ పాల్గొన్నారు.

ఆమె ప్రాణం నిలువలేదు

● నెలరోజుల క్రితం జామిలో గాయపడిన గుర్తుతెలియని మహిళ
● ఆసుపత్రిలో చేర్చిన పోలీసులు, సంఘ సేవకుడు
● చికిత్స పొందుతూ మృతి
● భౌతిక కాయాన్ని స్వగ్రామానికి అంబులెన్స్‌లో తరలించిన దాత



మృతదేహాన్ని తరలించేందుకు సిద్ధం చేసిన అంబులెన్స్

జామి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : ముప్పై ఏళ్లకు పైబడి వయసున్న ఆ మహిళ జామి మండల కేంద్రంలో మూడు నెలలపాటు తిరుగాడింది. మానసిక స్థితి బాగాలేక.. ఆహారం లేక నీరసించి పోయింది. ఎవరైనా అన్నం పెడితే తినేది. అదే సమయంలో ఏ కారణం చేతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆకతాయిలు దాడి చేశారని కొందరు భావిస్తున్నారు. కారణం ఏదైనప్పటికీ గాయాలు, చిరిగిన దుస్తులతో ఓ రోజు పోలీసులకు కనిపించింది. వెంటనే ఎస్ఐ వీరజనార్దన్ గ్రామానికి చెందిన సంఘ సేవకుడు ఎర్ని వెంకటరమణతో కలిసి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించారు. అయితే గాయాలు తీవ్రంగా ఉండడంతో ఆమెను విజయనగరం ప్రభుత్వ మహారాజ ఆసుపత్రికి తరలించారు. సుమారు నెలరోజుల పాటు ఆమె బాగోగులను సంఘసేవకుడు రమణే చూశారు. ఇదే సమయంలో పోలీసులు ఆమె చిరునామా కోసం ప్రయత్నించారు. ఈలోగా పరిస్థితి విషమించి ఆమె చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే సోమవారం తుదిశ్వాస విడిచింది.

ఆమె నేపథ్యం..

ఆ మహిళపేరు కరీమున్. బాపట్ల జిల్లా ఇంకోల్లు మండలం కొణికి గ్రామం. ఈమె నిరుపేద ముస్లిం కుటుంబంలో పుట్టింది. తల్లిదండ్రులు అమెకు వివాహం చేశారు. ఇద్దరు పిల్లలు. అయితే నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో పాటు కొంచెం మానసిక స్థితి బాగోలేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. కొద్దిరోజులకే అక్కడ మాయం అయిపోయింది. తర్వాత వారు వెతికిన ఫలితం లేకపోవడంతో మిన్నకుండిపోయారు. మూడునెలల క్రితం జామి వచ్చింది. సెంటర్‌లో ఉండేది. నెలరోజుల క్రితం ఈమె ఒంటిపై, చేతులపై గాయాలు కావడంతో వైద్యసేవలకు తరలించారు.

ఆదుకున్న మానవత్వం

ఆసుపత్రిలో చేర్పించిన పోలీసులు ఒకవైపు వైద్యసేవలు చేయిస్తునే మరోవైపు ఆమె చిరునామా తెలుసుకునే పనిలో పడ్డారు. దురదృష్టం ఏంటంటే అమె చనిపోయాక కుటుంబసభ్యుల వివరాలు తెలిశాయి. వారు ఆసుపత్రికి వచ్చి చనిపోయిన కరీమున్‌ను చూసి విలపించారు. తాము నిరుపేదలమని చెప్పడంతో అమె బాగోగులు నెలరోజులపాటు చూసిన రమణ అక్కడ వున్న విజయనగరం యూత్ ఫౌండేషన్‌కు తెలియజేశారు. అందరూ కలిసి రూ.30వేల సాయం అందించారు. నగదుతో పాటు మృతదేహం తరలింపునకు అంబులెన్స్ ఏర్పాటుచేసి కుటుంబ సభ్యులను పంపించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

బొబ్బిలి/ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణానికి సమీపంలో గున్నతోటవలస సమీపంలో సోమవారం సాయంత్రం రైలు ఢీకొన్న ప్రమాదంలో మెట్టవలసకు చెందిన కొండపల్లి శ్రీహరి(24) అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు కథనం ప్రకారం.. శ్రీహరి బొబ్బిలి-డొంకినవలస రైల్వే ట్రాక్‌పై పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొంది. ప్రమాదంలో శ్రీహరి అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీహరి తండ్రి శ్రీనివాసరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీహరి మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతడి అన్నయ్య ఎంసీఏ చదువుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

బొబ్బిలి/ విజయనగరం క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కింతలాంబకు చెందిన కిల్లక మోహనరావుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి సోమవారం తీర్పు వెల్లడించారనిఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు పార్వతీపురం పట్టణంలోని ఒక పాఠశాలలో చదువుతున్న బాలిక తన అవసరాల కోసం రూ.3వేలు కావాలని తన సమీప బంధువును అడిగింది. ఆయన బొబ్బిలికి చెందిన మోహనరావుకు డబ్బులు పంపారు. ఆ డబ్బులు తీసుకునేందుకు బాలిక పార్వతీపురం నుంచి బొబ్బిలికి వచ్చింది. ఆ డబ్బులు ఇస్తానని చెప్పి బాలికను తన గదికి తీసుకెళ్లి మోహన్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. సదరు బాలిక ఆ విషయాన్ని తన సమీప బంధువుకు తెలిపింది. ఆయన వెంటనే 112 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేశారు. పార్వతీపురం పోలీసులు రిపోర్టు తీసుకుని జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బొబ్బిలి పోలీసులకు బదలాయించారు. దీనిపై బొబ్బిలి సీఐ కటకం సతీష్ కుమార్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు. కోర్టులో మోహనరావుపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి నాగమణి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్టా ఖజానారావు వాదించారు. ప్రాసి క్యూషన్‌కు సహకరించిన సీఐ సతీష్‌కుమార్, హెచ్‌సీ ఎం.మన్మథరావు, సీఎం ఎస్ కానిస్టేబుల్ సీహెచ్.రామకృష్ణలను ఎస్పీ అభినందించారు.

పోక్సో కేసు నమోదు

సంతకవిటి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన కోరుకొండ విజయ్‌కుమార్ లైంగిక దాడి చేయడంతో పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయ్‌కుమార్ భార్య, బాలిక ప్రతిరోజు మాట్లాడుకుంటూ ఉండటంతో బాలిక తన భార్యకు తనపై ఏదో చెడుగా చెబుతుందని విజయ్‌కుమార్‌లో అనుమానం మొదలైంది. దాంతో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో విజయ్ కుమార్ బాలికపై దాడి చేశాడు. బాలిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన రైలు



నుజ్జయిన ద్విచక్ర వాహనం

నెల్లిమర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయానికి సమీపంలో హౌరా-చెన్నై రైల్వే ట్రాక్‌పై సోమవారం బైక్‌ను రైలు ఢీకొంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే ఓ వ్యక్తి బైక్‌పై రైల్వే పట్టాలు దాటుతుండగా అదే సమయంలో హౌరా-చెన్నై మెయిల్ వచ్చింది. దాంతో సదరు వ్యక్తి బైక్‌ను పట్టాలపై వదిలేసి పరుగు తీశాడు. దీంతో రైలు బైక్‌ను ఢీకొంది. దాంతో సుమారు 30 అడుగుల దూరంలో బైక్ ఎగిరిపడింది. అయితే ద్విచక్ర వాహనదారుడు ఎవరనే విషయం తెలియరాలేదు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమ వారం గంజాయితో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు జీఆర్‌పీ విజయన గరం ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. అతడి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒడిశా రాష్ట్రానికి చెం దిన వ్యక్తి రాయగడ నుంచి రైలులో విశాఖపట్నానికి గంజాయి రవాణా చేస్తుండగా తనిఖీల్లో పట్టు బడ్డాడన్నారు. సదరు వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలతో...

నెల్లిమర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం కెల్ల గ్రామంలో సోమ వారం నిర్వహించిన దాడుల్లో 9 మద్యం సీసాలతో సారిపల్లి లక్ష్మణ పట్టుబడినట్టు సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. అలాగే నెల్లిమర్ల నగర పంచాయతీ లో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు, హెచ్‌సీలు వి.కృష్ణ, ఎం.అప్పారావు, కానిస్టేబుళ్లు డి.కె.శంకర్, సీతాలక్ష్మి పాల్గొన్నారన్నారు.

కుదించుకుపోయి.. రూపు కోల్పోయి!

(5వ పేజీ తరువాయి)

జిల్లా కేంద్రంలో కొత్తవలస నవదుర్గా ఆలయ చెరువుతో పాటు పాత్రుడు, అమ్మిగారి కోనేరుల అభివృద్ధికి సుమారు రూ.1.4 కోట్లు విడుదలయ్యాయి. అయితే నవదుర్గా ఆలయ చెరువు అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.62 లక్షలు మాత్రమే కేటాయించారు. తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. చెరువు కలుషితమై దుర్వాసన వెలువడగా.. చిన్నలు, పెద్దలు అక్కడ కూర్చోడానికి కూడా ఇష్టపడడం లేదు. ఆహ్లాదకర వాతావరణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కాగితాలకే పరిమితం..

జిల్లా కేంద్రంలో చెరువుల అభివృద్ధి అనేది కాగితాలకే పరిమితమైంది. కొత్తవలస నవదుర్గా ఆలయం వద్ద చెరువుతోపాటు అమ్మిగారి కోనేరు, పాత్రుడు కోనేరు, బోటువాని చెరువు, బెలగాం లంకె చెరువులను అభివృద్ధి చేయాల్సి బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది.

- పి.సన్యాసిరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి

ఆదేశాలు రాలేదు..

జిల్లా కేంద్రంలో చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదు. వాటిపై ప్రతిపాదనలు కూడా రూపొందించ లేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరాజు, డీఈఈ, పార్వతీపురంమున్సిపాల్టీ

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

● జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన గిరిజన గురుకులాల విద్యార్థులను కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సన్మానించారు. జిల్లాలోని జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చడం పట్ల కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో 137, 900, 2,864 ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎస్.నందవర్ధన్ నిహాల్, ఎస్.అఖిల్, పి.జగదీశ్వరరావులకు ఆయన దుశ్శాలువతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ తెలిపారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదన్నారు. జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.ధర్మారావు మాట్లాడుతూ ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ విద్యార్థుల కోసం రూ.40వేలు ఖరీదు చేసే పుస్తకాలను ఉచితంగా అందించారన్నారు. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన ఎస్.నందవర్ధన్ నిహాల్ 98, ఎస్.అఖిల్ 93, పి.జగదీశ్వరరావు 84, కె.అభినందనరావు 84, ఎ.లోకేష్ 75 శాతం మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు వివరించారు.

30లోగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

పాచిపెంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి ఆరో తరగతి మెరిట్ లిస్ట్ విడుదలైందని కోటికిపెంట ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు తమ ఒరిజనల్ పత్రాలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య సమయంలో పాఠశాలలకు వెళ్లి అందించాలన్నారు. విద్యార్థితో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, కుల, నివాస ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డుతో పాటు దివ్యాంగులైతే దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, స్టడీ, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లతో పాటు నాలుగు పాస్‌పోర్టుసైజ్ ఫోటోలను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 6302863658, 9936666425 నెంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

చెరువులో చేపల మృతి

కురుపాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కురుపాంలోని సంతకోనేరు చెరువులోకి గ్రామంలోని డ్రైనేజీ నీరు కలవడంతో మత్స్యకారులు పెంచుతున్న చేపలు సోమవారం మృతిచెందాయి. కురుపాం మత్స్యకారులు ప్రభుత్వానికి రుసుం చెల్లించి స్థానిక సంత కోనేరులో చేప పిల్లలు తెచ్చి, పెంచుతున్నారు. అయితే ఇందులో కలుషిత నీరు కలవడంతో చేపలు మృతిచెందినట్టు మత్స్యకారులు ఆరోపిస్తున్నరు. మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ రూ.లక్షా 20 వేల పెట్టుబడితో చేప పిల్లలను విడిచి పెట్టామని, తీరా చేతికి అంది వచ్చి అమ్మే సమయంతో మృతి చెందాయని తెలిపారు. కలుషిత నీరు కలడం వల్ల గత మూడు రోజులుగా చేపలు మృతి చెందుతున్నాయని అన్నారు. సోమవారం పెద్దఎత్తున చేపలు మృతి చెందాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం అందేలా అధికారలు కృషి చేయాలని, అలాగే కలుషిత నీరు చెరువులో చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై స్థానిక పంచాయతీ ఈవో వై.వెంకటనాయుడు, మత్స్య శాఖ అసిస్టెంట్ రంభ, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ పరిశీలించారు. డ్రైనేజ్ చెరువులు చేరకుండా చర్యలు చేపడతామని మత్స్యకారులకు హామీ ఇచ్చారు.

భవిష్యత్తులో తప్పులు జరగకుండా చూస్తాం

మక్కువ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన ఘటన భవిష్యత్తులో జరగకుండా చూసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్.కృష్ణవేణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అనసభద్ర పాఠశాలలో ఈనెల 13వ తేదీ రాత్రి ఏఎన్ఎం దుస్తులను విద్యార్థులు దొంగలించారని ఆరోపణతో వార్డెన్ వారిని తీవ్రంగా కొట్టారంటూ తల్లిదండ్రులు ఆందోళన చేశారన్నారు. అయితే వార్డెన్ విద్యార్థులను మందలిస్తూ నెమ్మదిగా కొట్టారని చెప్పారు. అంతేగానీ కప్పగెంతలు వేయించడం, తలకిందులుగా ఉంచడం వంటి పనులను చేయించ లేదన్నారు. తర్వాత వార్డెన్ విద్యార్థుల తల్లిదండ్రులకు క్షమాపణ కూడా చెప్పారని ఆమె తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని ఆమె అన్నారు.

నూతన ఆలోచనలతో మేథో శక్తి

గరుగుబిల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు నూతన ఆలోచనలతో ముందుకు సాగితే మేథో శక్తి పెరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ (హబ్ స్కూల్) రెండో దశ బూట్ క్యాంపును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఏడు మండలాల పరిధిలోని ఏడు పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న ప్రాజెక్టులు తయారు చేసేందుకు ప్రత్యేకంగా బూట్ క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

మక్కువ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆమె ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పని అడిగిన ప్రతి ఒక్కరికీ సకాలంలో పనులు అందించాలని, గరిష్ట వేతనం రూ.300 దక్కేలా వేతనదారులకు కొలతలు ఇవ్వాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా రెండు పూటలా పనులు నిర్వహించాలన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో శంబంగి ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసనల హోరు

● వివిధ సమస్యలపై కలెక్టరేట్ వద్ద ఆందోళనలు

బెలగాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం కలెక్టరేట్ సోమవారం నిరసనలతో హోరెత్తింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ● సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకుడు ఎం.గోపాలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని ఆరోపించారు. ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని, పని దినాలు పెంచాలని కోరారు. ● మక్కువ మండలం సీబిల్లి పెద్దవలసకు చెందిన దీసరి అప్పలస్వామి భూమిని సాక్షి సంతకాల పేరుతో తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న అదే గ్రామానికి చెందిన ఒక ఆసామిపై చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం నాయకుడు శ్రీనునాయుడు డిమాండ్ చేశారు. గిరిజనులు, రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు. ● గిరిజనులు, దళితులు, పేదలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు.



బెలగాం: సాగు భూములకు పట్టాలివ్వాలని ఆందోళన చేస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



బెలగాం: జేసీకి వినతిప్రతం అందజేస్తున్న బంటువానివలస గ్రామస్థులు

కూల్చివేసిన స్థలం ఆక్రమణే..

బెలగాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం బంటువానివలస గ్రామంలో ఆదివారం ప్రభుత్వం ప్రహరీని కూల్చివేసి స్వాధీనం చేసుకున్న 11 సెంట్ల స్థలం మాజీ సర్పంచ్ ఆక్రమించిన స్థలమేనని, దీనిపై ఎటువంటి రాజకీయ కక్షలు లేవని ఆ గ్రామస్థులు తెలపారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జేసీకి వినతిపత్రం అందించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. గతంలో బంటువానివలసలో అడ్డాపుశిల మాజీ సర్పంచ్ భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై అనేక మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. నిబంధనల ప్రకారమే అధికారులు ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని వారు స్పష్టంచేశారు. ఈ ఘటనను ఎమ్మెల్యే బోనెల విజయచంద్రపై నెట్టి బురద జల్లడం సమంజసం కాదన్నారు. అనంతరం జేసీ శోభికకు వినతిపత్రం ఇచ్చారు. అనేక భూ కబ్జాలకు పాల్పడిన మాజీ సర్పంచ్‌పై విచారణ చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మర్రాపు పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించండి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్డ్‌లో చేర్చాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజన ఉత్పత్తులు చేతపట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఆర్గనైజర్ ఊర్లక త్రినాథ్ మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగ యువకు ఉద్యోగవకాశాలు కల్పించాలని, రెవెన్యు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన ఉత్పత్తులకు జీసీసీ ద్వారా మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. ఈ ధర్నాలో గిరిజన సంఘం నాయకులు తెల్లయ్య, ఎస్.చిన్నారావు, ఎల్లంగ, తవుడు, కన్నయ్య పాల్గొన్నారు.



సీతంపేట రూరల్: ఐటీడీఏ ఎదుట కొండచీపుర్లతో ధర్నా చేస్తున్న గిరిజనులు

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్పీ

బెలగాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం లేకుంగా సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందినట్టు ఆయన తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన దర్యాప్తు చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రేమ పేరుతో మోసాలు, కుటుంబ తగాదాలు, నకిలీ పత్రాలు, అత్తారింటి వేధింపులు, అధిక వడ్డీలు, భూ వివాదాలు, సైబర్ క్రైం తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఎస్ఐ ప్రకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

సీతంపేటలో ప్రజా దర్బార్

సీతంపేట రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండల కేంద్రంలోని కూటమి పార్టీ కార్యాలయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాలకు చెందిన నాయకులతో పాటు గిరిజనులు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించారు. తాగునీటి ఎద్దడిపై పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి, కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ దర్బార్‌లో ఎమ్మెల్యే జయకృష్ణతో పాటు ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ మాలయ్య, సొడంగ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 44 వినతులు

సీతంపేట రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 44 వినతులు వచ్చాయి. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని పసుకుడి గ్రామానికి చెందిన పాలక కాంతమ్మ కోరారు. పనసలోవ గ్రామానికి వరదగోడ మంజూరు చేయాలని బెజ్జి కృష్ణారావు కోరగా, అంబలగండిలో అంతర్గత సీసీ రహదారి నిర్మించాలని గేదెల కుష్టయ్య కోరారు. పాతపట్నం మండలం నేలబొంత కాలనీలో బోరువెల్ నిర్మించాలని చిట్టిబాబు కోరారు. పీపీ ఈతమానుగూడలో పంచాయతీ భవనం నిర్మించాలని పత్తిక వీరన్న కోరారు. ఇన్‌చార్జి పీవోతో పాటు టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీడీ అన్నదొర, పీఆర్ ఈఈ రాధారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

నిస్వార్థ సేవలు అందించాలి



అంగన్‌వాడీ ఆయాలకు నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన అంగన్‌వాడీ ఆయాలకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం పాలకొండలో నియామక పత్రాలను అందించారు. పాలకొండ పట్టణంలోని దేవాంగులవీధి అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి ఎర్ర ఊర్వశీ, భామిని మండలం గురండి-బి కేంద్రానికి తోలాపు కాంచన, ఇదే మండలం లివిరి గ్రామంలోని కేంద్రానికి మీల భారతమ్మ ఎంపిక కాగా, వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలను అందించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమితులైన ఆయాలు నిస్వా ర్థ సేవలు అందించాలన్నారు. పిల్లలకు సకాలంలో పోషక పదార్థాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, పల్లా కొండబాబు, గంటా సంతోష్‌కుమార్, భూపతి ఆనంద్, లివిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క శాతం రిజర్వేషన్ అన్యాయం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమకు ఒక్క శాతం రిజర్వేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని జిల్లా రెల్లికుల సంక్షేమ సంఘం జేఏసీ కన్వీనర్ జి.డేనియల్ ఆధ్వర్యంలో ఆ సంఘ సభ్యులు ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు విన్నవించారు. సోమవారం పార్వతీపురం విచ్చేసిన వీర్రాజు స్థానిక ఇందిరా కాలనీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రెల్లి, వాటి ఉపకులాల సంక్షేమ సంఘం సభ్యులు వీర్రాజుకు తమ బాధలు తెలియజేస్తూ వినతపత్రాన్ని అందజేశారు.

రెల్లి కుల అభివృద్ధి సేవా సంఘం కార్యవర్గం ఏర్పాటు

పాలకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రెల్లి కుల అభివృద్ధి సేవా సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ ఉపాధ్యక్షుడు మజ్జి బాబ్జీ సమక్షంలో ఏర్పాటు చేశారు. సోమవారం పాలకొండ పట్టణంలోని రెల్లి వీధిలో జైభీమ్, రెల్లికుల అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా దేవపల్లిరాజు, ఉపాధ్యక్షులుగా ఇమిడిశెట్టి చోటు, సొండి ప్రభు, కార్యదర్శిగా ఇమిడిశెట్టి వంశీ, సహాయ కార్యదర్శులుగా లోకొండ మహేష్, సొండి సుధీర్, ట్రెజరర్‌గా సొండి శ్రీను, ఆకుల నవీన్, ఆర్గనైజర్ ప్రెసిడెంట్‌గా లోకొండ గణేష్, పిన్నింటి రాజ్‌కుమార్, కళింగపట్నం కిషోర్, ముఖ్య న్యాయ సలహాదారుడుగా బెవర శివప్రసాద్, గౌరవాధ్యక్షులుగా మజ్జి బాబ్జీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

కురుపాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో ఆరో తరగతిలో 100 సీట్లుగాను ప్రవేశ పరీక్షకు 240 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, 199 విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారని తెలిపారు. ఈ పరీక్ష డిపార్టుమెంట్ అధికారిగా టి.శంకరరావు వ్యవహరించగా, ఎంఈవో సత్యనారాయణ పర్యవేక్షించారు. ● సాలూరు రూరల్: పురోహితునివలస ఆదర్శ పాఠశాల ఆరో తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 107 మంది దరఖాస్తు చేసుకోగా 85 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.అంజలి దేవి చెప్పారు. మరో 22 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఈ పరీక్ష నిర్వహణ తీరును డీఈవో రమాజ్యోతి పరిశీలించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి



ప్రభుత్వ బడిలో చేరిన పిల్లలతో ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యం లో సోమవారం నిర్వహించిన బడిఈడు పిల్లలను బడిలో చేర్చే కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని సర్కారు బడుల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్న విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ముందుగా పాఠశాలలోని సరస్వతిదేవి, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం పాఠశాలలో 20 మంది విద్యార్థులు చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఎంపీడీవో సాల్మన్‌రాజు, తహసీల్దార్ శేఖర్, ఎంఈవో-2 భీముడు, నాయకులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

సీతంపేట రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కుసిమిగూడలో పాలకొండ ఎక్సైజ్ అధికారులు చేపట్టిన దాడుల్లో 20 లీటర్ల సారా తరలిస్తున్న సవర బాపడు, సవర రాములను అరెస్ట్ చేసి నట్టు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. సోమవారం సీతంపేట ఏజెన్సీలో దాడులు నిర్వహించి, సారాను స్వాధీనం చేసుకుని వెయ్యి లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్టు సీఐ తెలిపారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసిన పాలకొండ పట్టణానికి చెందిన వ్యాపారి ముంజేటి మన్మథ రావుపై కేసు నమోదు చేసినట్టు పేర్కొ న్నారు. ఆయన వద్ద నుంచి 1312 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వీరఘట్టం మండ లానికి చెందిన పాత కేసులలో ముద్దాయిలుగా ఉన్న ఎస్.సుమన్, పి.భుజంగరా వులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

● వీరఘట్టం: చిన్నగొర పరిసరాల్లో బెల్లం ఊట ఉన్న విషయం తెలియడంతో స్థానిక పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో 1200 లీటర్ల బెల్లపూటను గుర్తించి, ధ్వంసం చేశామని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.

918 లీటర్ల సారా ధ్వంసం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో గత ఏడాది ఆగస్టు నెల నుంచి డిసెంబరు 24వ తేదీ వరకు స్వాధీనం చేసుకున్న 918 లీటర్ల సారా ప్యాకెట్లను సోమవారం నవిరి పాత రోడ్డులో ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ మాట్లాడుతూ ఈ సారా కేసుల్లో పరారీలో ఉన్న జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీకి చెందిన పి.కార్తీక్, కె.పెంటయ్య, పాతరెల్లి వీధికి చెందిన కె.విజయ్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దయానిధిపురం, కోటసీతారాంపురం పంచాయతీల పరిధిలోని ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ రామచంద్రరావు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మస్తర్లు తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి సిబ్బంది నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. సోమవారం గరుగుబిల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. పనికి రాకుండా మస్తర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు.

వేతనదారులకు తాగునీరు అందించాలి

కురుపాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ వేతనదారులకు పని చేసే ప్రదేశం వద్ద తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. సోమవారం ఉపాధి హామీ పనులపై ఏపీవో పి.బావాజీ ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఉమామహేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరికీ పని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలకు తాగు నీటి సదుపాయం కల్పించాలన్నారు. ఈసీ రమణమూర్తి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోండి

గరుగుబిల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెతో పాటు ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి, హెచ్ఎం ఎస్ఎల్ పాత్రుడు పాల్గొన్నారు. గరుగుబిల్లి, రావివలస సెక్టార్ల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

గరుగుబిల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎంఈవో దత్తి అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, రావుపల్లి, కొత్తూరు తదితర గ్రామాల్లో ఆయన సోమవారం అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈనెల 23వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. హెచ్ఎం గొర్లి నర్సింగరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



